క్లుప్తంగా

ఆశాజనకంగా జొన్నపంట



ఉత్తులూర్ వద్ద జొన్న పంట

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో జొన్న పంట ఆశాజనకంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పెద్దశంకరంపేట, ఉత్తులూర్, రామోజీపల్లి, నారాయణపల్లి, కొత్తాపేట, ముసాపేట, దానంపల్లి, మాడ్చెట్‌పల్లి, కె.వెంకటాపూర్, బూర్గుపల్లి, టెంకటి తదితర గ్రామాల్లో రైతులు జొన్నపంటను సాగు చేశారు. పక్షులు, ఈదురుగాలుల నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు ఒక కంకికి మరో కంకిని కలిపి కడుతూ బిజీగా ఉన్నారు. ఉత్తులూర్ వద్ద జొన్నపంట చూపరులను ఆకట్టుకుంటుంది.

నల్లా బిల్లు చెల్లించకపోతే చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజోద్దీన్



ఖాజా మొహిజోద్దీన్

మనోహరాబాద్(తూప్రాన్): మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలంలో నల్లా బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజోద్దీన్ బుధవారం కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో నీటిపన్ను మాఫీ అయినట్లు దుష్ప్రచారం జరుగుతోందని, దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చెప్పారు. బిల్లులు చెలించని వారిపై చర్యలు తీసుకుంటామని, నల్లా కనెక్షన్ కూడా తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

50 మంది రక్తదానం



రక్తదాన శిబిరం వద్ద ఆవుల రాజిరెడ్డి తదితరులు

నర్సాపూర్: పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సుమారు 50 మంది పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం డంగోరియా ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులు ఆయనకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.


పోగొట్టుకున్న ఫోన్‌లు రికవరీ



సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న ఎస్‌ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): పోగొట్టుకున్న రెండు సెల్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు బాధితులకు అందజేశామని ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. సూరారం గ్రామానికి చెందిన తలారి రమేశ్, మహేశ్ నెలరోజుల క్రితం తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. ఎస్‌ఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు వాటిని రికవరీ చేసి బాధితులకు బుధవారం అందజేశారు. దానికి కృషిచేసిన కానిస్టేబుల్ రాజశేఖర్‌ను ఎస్‌ఐ అభినందించారు. సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న వారు వెంటనే ఎస్‌ఈఐఆర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఫోన్ రికవరీచేసి ఇవ్వనున్నట్లు తెలిపారు.

రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తిలో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. మండల సీనియర్ నాయకుడు అవుసుల మల్లేశ్‌తో పాటు పలువురు మాజీ వార్డు మెంబర్‌లు, నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశ్, సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీశైలం, కుమార్, అశోక్, సత్యనారాయణ, శేకులు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయం.. సహకార భవనం

మత్స్యకారుల అభివృద్ధిలో భాగంగా మత్స్యకారులు సమావేశాలు నిర్వహించుకునేందుకు చేపట్టిన మత్స్య సహకార కమ్యూనిటీ భవనాలు అలంకార ప్రాయంగా మారాయి. నిర్మాణం చేపట్టి ఏడేళ్లు కావస్తున్నా అందుబాటులోకి తీసుకు రాకపోవడం వారిలో నిరాశ నింపుతోంది.

- మధ్యలోనే నిలిచిపోయిన నిర్మాణాలు
- 7 ఏళ్లు గడిచినా అందుబాటులోకి రాలేదు
- నిరాశ చెందున్న మత్స్యకారులు



ప్రారంభానికి నోచుకోని మత్స్య సహకార భవనం

కొల్చారం(నర్సాపూర్): మండలంలో మత్స్యకార కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం మూడు గ్రామాలను ఎంపిక చేసింది. ఒక్కో భవనానికి ఎస్డీఎఫ్ నిధులను కింద రూ.10లక్షలు నిధులు మంజూరు చేస్తూ రంగంపేట, సంగాయిపేట, అంసాన్ పల్లి గ్రామాల్లో 2016 జనవరిలో శంకుస్థాపన పనులు చేపట్టడంతో పాటు ఆరు నెలల తర్వాత నిర్మాణ పనులను ప్రారంభించారు. వాటిలో సంగాయిపేటలోని భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టినా ఇప్పటికీ అందుబాటులోకి తీసుకురాలేదు. రంగంపేటలోని భవనం పూర్తయినా రంగులు, విద్యుత్ సౌకర్యం, ఇతర పనులు చేపట్టాల్సి ఉండగా మధ్యలోనే ఆపేశారు. అంసాన్‌పల్లిలో అయితే స్లాబు వేసి, గోడల నిర్మాణం చేపట్టి వదిలేశారు.

నిధులు సరిపోలేదు..

అప్పట్లో ప్రభుత్వం కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో నిర్మాణాలకు సరిపోకపోలేదని, అదనపు నిధుల కోసం సంబంధిత శాఖకు నివేదికలు పంపించామని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు. అయితే నిధులు నేటికీ విడుదల కాకపోవడం వల్ల లక్షల రూపాయలతో నిర్మించిన భవనాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. నిధులు విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నేతలను మత్స్యకారులు కోరుతున్నారు.

“ చెట్లనీడలోనే సమావేశాలు



ఏళ్లు గడుస్తున్నా భవనాలను అందుబాటులోకి తీసుకురాకపోవడం, ఇబ్బందికరంగా తయారైంది. ఏ సమావేశం నిర్వహించుకోవాలన్నా చెట్ల నీడ, చెరువు కట్టలను ఆశ్రయించవలసిన పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వమైనా భవనాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– నర్సింహులు, మత్స్యకారుడు రంగంపేట

కాంగ్రెస్‌తో కరువొచ్చింది

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువొచ్చిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నార్సింగి మండలంలోని నర్సంపల్లి తండాలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం మీద ఆధారపడి బతికే రైతు కుటుంబాలు పంటలు ఎండిపోవడంతో ఆందోళనలో పడ్డారని అన్నారు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లు ఎండిపోయాయన్నారు. రైతులకు నీరు అందించేందుకు ప్రాజెక్టుల గేట్లు ఎత్తడం మరచి.. ప్రతిపక్ష నాయకులను చేర్చుకోవడానికి పార్టీ గేట్లు ఎత్తుతున్నారని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంట్ కూడా సక్రమంగా రావడం లేదన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ. 15 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్ నుంచి నీరు విడుదల చేసి వాగులు, వంకలు, చెరువు కుంటలు నింపాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, మాజీ సర్పంచ్‌లు చైత్రియా, శ్రీనివాస్, చేగుంట జెడ్పీటీసీ ముదం శ్రీను ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌లో బుధవారం మండల పశువైద్యాధికారి రాజు ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తోందని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీఓ కృష్ణకుమార్, ఎల్‌ఎస్‌ఏ వీరారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య పాల్గొన్నారు.

సాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ప్రతేక బలగాలు

వెల్దుర్తి(తూప్రాన్): ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తూప్రాన్ సీఐ రెడ్డబోయిన కృష్ణ పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం వెల్దుర్తిలో పోలీసు సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: యూపీఎస్‌సీ, సీఎస్‌ఏటీ–2025 పరీక్ష కోసం 100 మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లానాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థుల ఏప్రిల్ 12వ తేదీ వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. సమాచారం కోసం 040– 23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సక్రమంగా విధులు నిర్వర్తిస్తే మంచిపేరు

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ లింబాద్రి



నర్సును సన్మానిస్తున్న వైద్యులు

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీలు సర్వసాధారణమేనని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి పేర్కొన్నారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన ఫెయిర్‌వెల్ అండ్ వెల్‌కం పార్టీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సక్రమంగా తమ విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఏడుగురు నర్సులు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో కొత్తగా 14మంది బాధ్యతలు స్వీకరించారు. వారిలో కొందరు ఇతర ఆసుప్రత్రులకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. కార్యక్రమంలో డాక్టర్లు సుకేషిని, ప్రదీప్, మణికంఠ, హెడ్ నర్స్ జయలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

తాగునీటి సమస్య రావొద్దు



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఆనంద్



రేగోడ్: తాగునీటి ట్యాంకులను పరిశీలిస్తున్న డీపీఓ యాదయ్య

ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ ఆనంద్ ఆదేశించారు. బుధవారం తన కార్యాయలంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం వందశాతం ఉండేలా చూడాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఆయా పార్టీలకు సంబంధించిన బోర్డులు కనిపిస్తే తొలగించాలని, వారంలో మూడు రోజులు తప్పనిసరిగా చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. ఒకరోజు డ్రైడే నిర్వహించాలని చెప్పారు. దోమల నివారణకు బ్లీచింగ్, ఆయిల్‌బాల్స్ వినియోగించాలని సూచించారు. ఎంపీఓ శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రేగోడ్(మెదక్): తాగునీటి సమస్య రానివ్వొద్దని డీపీఓ యాదయ్య ప్రత్యేక అధికారులను ఆదేశించారు. రేగోడ్, కొండాపూర్ గ్రామాలను బుధవారం ఆయన సందర్శించి పరిసరాలు, తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. రేగోడ్ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ పాఠశాలల బ్యాంకు ఖాతాల సేకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన నూతన బ్యాంకు ఖాతాల వివరాలను స్థానిక ఎమ్మార్సీలో అందజేయాలని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. ఆయా పాఠశాలల్లో నూతనంగా అమ్మ ఆదర్శ కమిటీలకు సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఎస్ కో ఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, హెచ్‌ఎం రామచంద్రాచారి, ఉపాధ్యాయులు గోపి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

◆ మోదీపై అనుచిత వాఖ్యలు సరికాదు

టేక్మాల్(మెదక్): ప్రధాన మంత్రి మోదీపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం టేక్మాల్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు ప్రధానిని ఇష్టానుసారంగా విమర్శించడం పద్ధతి కాదన్నారు. గిరిజన మోర్చా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్యానాయక్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, జిల్లా నాయకులు ఎల్లుపేట రాజు, మోహన్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

◆ ఫార్మాసిస్టుకు సన్మానం

చేగుంట(తూప్రాన్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఫార్మాసిస్టు పగడయ్యను జిల్లా వైద్యాధికారి సన్మానించినట్లు సీహెచ్‌ఓ కిషన్ తెలిపారు. త్వరలోనే పగడయ్య పదవీ విరమణ జరగనున్న సందర్భంగా విధుల్లో అంకిత భావంతో పని చేసిన ఫార్మసిస్టును మెదక్‌లో జిల్లా వైద్యాధికారి శ్రీరాములు, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి అరుణశ్రీ, వైద్యులు నవీన్, మాధురి సన్మానించినట్టు పేర్కొన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి



నర్సాపూర్: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

అదనపు కలెక్టర్ రమేశ్

నర్సాపూర్/కౌడిపల్లి(నర్సాపూర్): తాగు నీటి సమస్య లేకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ ఆదేశించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ప్రారంభమైనందున నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ మధులత, మున్సిపల్ కమిషనర్ జైతురాం నాయక్, డీఎల్‌పీఓ యాదయ్య, ఎంపీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ డీఈఈ కిషన్, ఏఈ స్వామిదాస్, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీ వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, ఇతర నీటి వనరులపై పంచాయతీ కార్యదర్శులు గ్రామాల వారీగా వివరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు రాని రోజు ప్రజలకు తాగు నీరు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలు ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఆయిల్‌పామ్‌తో భూమికి సారం

ఏడీఏ వసంత సుగుణ



ఆయిల్ పామ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ వసంత సుగుణ

చిన్నశంకరంపేట(మెదక్): ఆయిల్ పామ్ సాగు వల్ల అంతర పంటలు వేసుకోవడంతో పాటు భూమి కూడా సారవంతం అవుతుందని రామాయంపేట వ్యవసాయ ఏడీఏ వసంత సుగుణ తెలిపారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో 5 ఎకరాల ఆయిల్ పామ్ పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో అంతర పంటగా, పచ్చి రొట్ట, జనుము, మినుములు, పెసర సాగు చేసుకోవచ్చన్నారు. అలాగే ఆయిల్ పామ్‌కు అలసంద ఎరువుగా ఉపయోగ పడుతుందని చెప్పారు. ఈ పంట ద్వారా భూమి సారవంతమవుతుందని, తదుపరి పంటలకు భూమి అనుకూలంగా మారుందని తెలిపారు. ఆమె వెంట ఏడీఏ సహాయ సంచాలకుడు అబ్దుల్ సత్తార్, నార్సింగి వ్యవసాయ విస్తరణ అధికారులు దివ్య, రైతులు పాల్గొన్నారు.

మద్యాన్ని తరలిస్తే చర్యలు తప్పవు

ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నిజాంపేట(మెదక్): స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనదారులు రూ.50వేలు కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లవద్దన్నారు. అలాగే అధిక మొత్తంలో బంగారం, మద్యాన్ని సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జయపాల్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్, రజాక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు రైతుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నర్సాపూర్: మండల ఇన్‌చార్జి సర్వేయర్ మొగులయ్య వెంచర్ యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నర్సాపూర్‌కు చెందిన రైతులు శ్రీశైలంయాదవ్, మల్లేశ్‌యాదవ్ ఆరోపించారు. ఆయన బారి నుంచి తమను, తమ అసైన్డ్ భూమిని కాపాడాలని బుధవారం తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తమ పట్టా భూమిని నర్సాపూర్ వెల్దుర్తి మార్గంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో డెవలప్‌మెంటుకు ఇచ్చామని, పట్టాభూమిని ఆనుకుని ఉన్న అసైన్డ్ భూమిని తాము డెవలప్‌మెంటుకు ఇవ్వలేదన్నారు. కాని ఆ భూమిని కూడా నిర్వాహకులు వెంచర్‌లో కలుపుకుని రోడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వారికి సర్వేయర్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. కోర్టు ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా తమకు నోటీసులు ఇచ్చారని, ఫోన్‌లో వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్లు రైతులు కోరారు.

కౌన్సిలర్ క్షమాపణ చెప్పాలి

ఇంటిని ముట్టడించిన కాంగ్రెస్ శ్రేణులు



కాంగ్రెస్ నేతలకు నచ్చజెప్పుతున్న డీఎస్పీ రాజేశ్

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు బొజ్జ పవన్, జీవన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ శ్రేణులు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు ఇంటిని ముట్టడించి సుమారు గంటపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మెదక్‌లోని వైస్రాయ్ గార్డెన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ సభలో మామిండ్ల ఆంజనేయులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వ్యక్తిగతంగా దూషించడం తగదన్నారు. బీఆర్‌ఎస్ నేతల ముందు కాంగ్రెస్ నేతలను తిడితే రాబోయే ఎన్నికల్లో మంచి ప్యాకేజీ వస్తుందన్న ఉద్దేశంతో మైనంపల్లిపై ఆరోపణలు చేశారని మండిపడ్డారు. పదేళ్ల అధికార అహంకారం ఆ నేతల్లో ఇంకా తగ్గలేదని విమర్శించారు. ప్రజల కోసం కృషి చేస్తున్న మైనంపల్లి కుటుంబంపై ఆరోపణలు చేసిన ఆంజనేయులు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే న్యాయపరంగా పోరాటం చేసి చర్యలు తీసుకునే వరకు ఊరుకోమని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రాజేశ్, పట్టణ, రూరల్ సీఐలు అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందందున ఆందోళనలు చేయడం సరికాదని, ఏదైనా ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

చిరుత దాడిలో లేగదూడ హతం



రామాయంపేట(మెదక్): మండలంలోని పర్వతాపూర్ పంచాయతీ పరిధిలోగల బాపనయ్య మోతుకుల తండాలో బుధవారం రాత్రి చిరుత దాడిలో ఓ లేగదూడ హతమయింది. తండాకు చెందిన గుగ్లోత్ భీమ్లా తన పశువులను పంట చేను వద్ద ఉంచగా చిరుత దాడిచేసి లేగదూడను హతమార్చింది. పశువుల అరుపులతో సమీపంలో ఉన్న గిరిజనులు అక్కడికి వెళ్లగా చిరుత అటవీప్రాంతంలోకి వెళ్లిపోయింది. చిరుత సంచారంతో తమకు నిద్ర లేకుండా గడుపుతున్నామని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. తమను చిరుత బారినుంచి కాపాడాలని అధికారులను వేడుకుంటున్నారు.

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం

టేక్మాల్(మెదక్): మండలంలోని తంప్లూర్ గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బుధవారం స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కొండా మురళీబాలమణి, కొండా శంకర్ ప్రసన్న దంపతులు కల్యాణోత్సవం జరిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పాతం శెట్టిపల్లి పరిధిలోని ఏడుపాయల టీ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఓ వృద్ధుడు నాలుగు రోజుల నుంచి జంక్షన్ వద్ద భిక్షాటన చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం బస్టాండ్ దగ్గర మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. బ్లూ కలర్ షర్ట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. సమాచారం తెలిసిన వారు ఉంటే తన ఫోన్ నం: 87126 57919ను సంప్రదించాలని కోరారు.